క్లుప్తంగా

డస్ట్‌బిన్లు పంపిణీ



గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు): వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ప్రతిఒక్కరు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ నక్కా కమల కోరారు. స్థానిక సచివాలయ కార్యాలయ ఆవరణలో గ్రామస్తులకు సోమవారం ఆమె డస్ట్‌బిన్‌లు పంపిణీ చేశారు. తడిపొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

360 మందికి వైద్య పరీక్షలు

నందిగామరూరల్: మండలంలోని రుద్రవరం గ్రామంలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమరావతి కంటి ఆస్పత్రి, ఆచంట లక్ష్మీపతి హాస్పిటల్ వైద్యులు సౌమ్య, కీర్తి, నేత్ర, నిచిత, లక్ష్మీప్రసన్న పాల్గొని మొత్తం 360 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. 75మందికి కళ్లజోళ్లు, 65 మందికి శుక్లాల శస్త్రచికిత్స అవసరమని నిర్ధారించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చెరుకూరు సాంబశివరావు, నాయకులు తోట నాగమల్లేశ్వరరావు, మన్నే కళావతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

27న మండల పరిషత్ సమావేశం

నందిగామ రూరల్: ఈనెల 27వతేదీ మధ్యాహ్నం రెండు గంటలకు నందిగామ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ పెసరమల్లి రమాదేవి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాదరావు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలని కోరారు. అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని, గైర్హాజరయ్యే అధికారులపై శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్



కంచికచర్ల: కంచికచర్ల నల్లవాగు(సుద్దవాగు)లో వరద ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందిన బత్తినపాడు గ్రామానికి చెందిన కామా శ్రీనివాసరావు కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షలను ఎక్స్‌గ్రేషియాగా చెల్లించి ఆదుకోవాలని బీఎస్పీ ఎంపీటీసీ సభ్యులు బర్రె ఉదయ్‌కిరణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు సోమవారం బహిరంగలేఖ రాశారు. ఈసందర్భంగా ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ వర్షాలు వచ్చిన సమయంలో పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు ఆయా వాగుల వద్ద కేవలం తూతూమంత్రంగా కాపలాగా ఉంచుతూ సమస్యను పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యే స్పందించి రూ.10కోట్లు ఖర్చుచేసి ఆయా చప్టాలు, వాగులపై వంతెనల నిర్మాణం చేపడితే ఇటువంటి ప్రమాదాలకు తావు ఉండదన్నారు. ఆదిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

వీరులపాడు: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు రవికిరణ్ సూచించారు. మండలంలోని అన్నవరం లో ఎనిమిదో రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా గర్భిణులు,, బాలింతలు, బాలికలకు పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని వివరించారు. సర్పంచ్ షోడగిరి రాజశ్రీ, సెక్టార్ అధికారి ప్రభావతి, అధికారులు పాల్గొన్నారు.

బతుకమ్మలాడే విషయంలో వాగ్వాదం

నందిగామ రూరల్: మండలంలోని లింగాలపాడు లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారి ఆలయంలో బతుకమ్మలాడే అంశం రెండు వర్గాల మధ్య వాగ్వాదానికి దారితీసిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో బతుకమ్మలాడేందుకు వెళ్లిన తమను..ఆలయాన్ని తమ సొంతంగా భావిస్తున్న ఓవర్గంవారు అడ్డుకున్నారంటూ గ్రామంలోని కాపు, బీసీ సామాజికవర్గానికి చెందిన మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. 25ఏళ్లుగా ఆలయ ఆవరణలో రెండువర్గాలుగా బతుకమ్మలు ఏర్పాటు చేసి ఉత్సవాలను జరుపుకుంటున్నామని ఈ ఏడాది కూడా బతుకమ్మలాడేందుకు వెళ్లగా, ఆలయ చైర్మన్ అనుమతి తీసుకోవాలని చెబుతూ సదరువర్గానికి చెందిన మహిళలు అడ్డుకున్నారని వారు వాపోయారు. దీంతో చేసేది లేక గ్రామంలోని ఖాళీప్రదేశంలో బతుకమ్మలను ఏర్పాటు చేసి వేడుకలను జరుపుకున్నట్లు కాపు, బీసీ మహిళలు తెలిపారు. ఈ విషయంపై ఆలయ సిబ్బందిని 'సాక్షి' దినపత్రిక సంప్రదించగా ఆలయంలో రెండు వర్గాలు కాకుండా అంతా కలిసి దసరా వేడుకలను జరుపుకోవాలని తాము సూచినట్లు వివరించారు.

కొలువుదీరిన అమ్మవార్లు

వైభవంగా శరన్నవరాత్రులు ప్రారంభం

జగ్గయ్యపేట: దసరా ఉత్సవాలు జగ్గయ్యపేట మండలంలో దసరా ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆయా మండపాల్లో కొలువుదీరిన అమ్మవార్లు బాలాత్రిపుర సుందర దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.తిరుమలగిరిలో వేంచేసియున్న వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి అర్చకుడు మణికంఠ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ముక్త్యాల భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయంలోని భవాని అమ్మవారిని బాలాత్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. బలుసుపాడు గురుధాంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవికి తాత్వికుడు గెంటేల వెంకట రమణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లను అధికసంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మవారు...

పెనుగంచిప్రోలు: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో వేదపండితులు, అర్చకులు వేదపఠనం, పూజా కార్యక్రమాలతో ఉత్సవాలను ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై శ్రీకనదుర్గమ్మ అమ్మవారిని అలంకరించి కుంకుమ పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు దంపతులు, ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్, ఏఈఓ జంగం శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు కాకాని అలేఖ్య, బెజవాడ శ్రీనివాసరావు, పాలాది వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తూర్పుబజారులో శ్రీదుర్గా మల్లేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంతోపాటు మండలంలోని ఆయా ఆలయాల్లో నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభించారు. పలు పందిళ్లలో మొదటిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

రజితకవచాలంకరణలో అమ్మవారు..

నందిగామరూరల్: శరన్నవరాత్రి ఉత్సవాలు నందిగామ మండలంలో సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని అంబారుపేట సత్యమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సత్యమ్మ అమ్మవారు రజితకవాలంకృతాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో సీతారావమ్మ, ఆలయ చైర్మన్ మంచాల మాధవరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. లింగాలపాడులోని లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారు, దాములూరు కూడలిలోని సంగమేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారు, గోళ్లమూడిలోని పార్వతీ అమ్మవారు, పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలో వేంచేసియున్న కనకదుర్గ, కనక మహాలక్ష్మి, జ్ఞాన సరస్వతీ అమ్మవార్లను బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులు కుంకుమార్చనలు చేశారు.



శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో పూజల్లో పాల్గొన్న చైర్మన్, ఈవో, భక్తులు



పెనుగంచిప్రోలులో బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో పూజలందుకుంటున్న అమ్మవారు



కంచికచర్ల వసంతకాలనీలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న సురేష్‌బాబు, భక్తులు

నందిగామ పట్టణంలో..

నందిగామటౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నందిగామలోని ప్రధాన ఆలయాలతోపాటు ఆయా వీధుల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. రామలింగేశ్వర స్వామి వాఆలయంలో శుకశ్యామలాంబ అమ్మవారు రజితకవచాలంకృత అలంకాయంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకా పరమేశ్వరి, సాయి అయ్యప్ప ఆలయంలోని మాలికాపురత్తమ్మ దుర్గామాత బాలాత్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో చండీ హోమం, మహాలక్ష్మీ హోమం, లక్ష్మీగణపతి హోమంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లను ఆలయాల ఈవోలు, నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



పేటలో శ్రీరజిత కవచాలంకృత దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మండలంలోని వత్సవాయి, దబ్బాకుపల్లి, మక్కపేట, చిట్టేల, భీమవరం, గోపినేనిపాలెం, మంగొల్లు, కంభంపాడు తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటుచేశారు. మొదటిరోజు అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. మండపాల వద్ద సాయంత్రం మహిళలు బతుకమ్మలను తయరుచేసి ఆడిపాడారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక వసంత కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబుతోపాటు ఆపార్టీ నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయగా, మహిళలు కుంకుమ పూజలు చేశారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఫైర్‌స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రంధి ఆదిత్య, మంగినేని బుడ్డియ్య, బండారుపల్లి శబరి తదితరులు పాల్గొన్నారు.



అల్లూరులో పూజలు చేస్తున్న ఆలయ ధర్మకర్త

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేటఅర్బన్: శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని జగ్గయ్యపేట పట్టణంలో ఆయా వీధులు, ఆలయాల్లో సోమవారం అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు బాలాత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక నకాశిబజారులోని శ్రీకనక దుర్గ ఆలయం, అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం,దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి, అద్దాలబజారులోని శ్రీకన్యకా పరమేశ్వరి, ఆనందసాయి తదితర ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అర్చకులు మహంకాళి రామప్ప, జొన్నాభట్ల కిషోర్‌శర్మ, చింతా శివరామశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చండీ హోమం చేశారు. మహాలక్ష్మి ఆలయ ట్రస్ట్ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాలలో ప్రత్యేక మండపాలలో కొలువుదీరిన అమ్మవారి విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అల్లూరులో వేంచేసియున్న సీతారామచంద్ర సహిత మహాలక్ష్మి ఆలయంలోని అమ్మవారిని బాలత్రిపుర సుందరీ దేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త భాస్కరరావు, అంజనాదేవి దంపతులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



ముక్త్యాలలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



అంబారుపేటలో రజితకవచాలంకారంలో దర్శనమిస్తున్న సత్యమ్మ అమ్మవారు



నందిగామలో అమ్మవారిని ఊరేగింపుగా మండపానికి తీసుకువెళ్తున్న భక్తులు



వత్సవాయి: మంగొల్లు శివాలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారు



తిరుమలగిరిలో బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో దుర్గామాత

కనులపండువగా బతుకమ్మ ఉత్సవాలు



విజ్ఞాన్ స్కూల్‌లో బతుకమ్మకు పూజలు చేస్తున్న తన్నీరు సుధారాణి, ఉపాధ్యాయులు



వరదరాజస్వామి ఆలయంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

జగ్గయ్యపేటఅర్బన్: దసరా పండుగ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలు సోమవారం సాయంత్రం స్థానిక శ్రీవరదరాజ స్వామి ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో తయారుచేసిన బతుకమ్మలతో మహిళలు ఆడిపాడారు. అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కొప్పు అనంతరాజా, తులసీ సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు, నోముల శివ కుమార్, చక్కా సుధాకర్ పాల్గొన్నారు. కమిటీ సభ్యులు బతుకమ్మల తయారీతోపాటు మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

విజ్ఞాన్ పాఠశాలలో..

విజ్ఞాన్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.బాలికలు బతుకమ్మలను చక్కగా అలంకరించుకుని తీసుకువచ్చారు. ఉపాధ్యాయులు బతుకమ్మకు పూజలు చేసి ఆడిపాడారు. విజ్ఞాన్ విద్యాసంస్థల డైరెక్టర్ తన్నీరు సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థులకు శిక్షణ

గరికపాడు(జగ్గయ్యపేట): వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామాల్లో రైతులకు ఆయా పంటలసాగుపై అవగాహన కల్పించాలని గరికపాడు కృషి విజ్ఞానకేంద్రం(కేవీకే)కోఆర్డినేటర్ రవికిషోర్ సూచించారు. కేవీకేలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులకు గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంపై సోమవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు 17వారాలపాటు గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. రైతుల స్థితిగతులు, పంటలసాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. వ్యవసాయంలో అధునాతన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విత్తనోత్పత్తిపై రైతులకు క్షేత్రస్థాయిలో వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజశేఖర్, ప్రభావతి, లక్ష్మీకళ, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ విద్యార్థులకు విత్తనోత్పత్తిపై అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ రవికిషోర్

పౌష్టికాహార ప్రాధాన్యంపై అవగాహన



గర్భిణులు, తల్లులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనుగంచిప్రోలు: పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార ప్రాధాన్యంపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఈసీసీ డే గురించి వివరించటంతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నేర్పించే కృత్యాలు, సిలబస్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, జయలక్ష్మి, విమల, రాజ్యలక్ష్మి, మంజుల, సునీత, కల్పన, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో...

నందిగామరూరల్: పౌష్టికాహారంతో అనారోగ్య సమస్యల బారినుంచి ఆరోగ్యాన్ని కాపాడుచకోవచ్చని సీడీపీవో లక్ష్మీభార్గవి పేర్కొన్నారు. మండలంలోని అంబారుపేట, ఐతవరం, మాగల్లు, రుద్రవరం, తదితర గ్రామాలలో పౌష్టికాహార మాసోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు చిరుధాన్యాలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు, మాంసాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగనవాడీ సూపర్‌వైజర్లు వెంకట్రావమ్మ, కరుణకుమారి, తారాభి, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డీటీకి వినతిపత్రం అందజేత

వీరులపాడు: ప్రభుత్వం మోటార్ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వీరులపాడు మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బండారుపల్లి మహేష్ కోరారు. ఈ మేరకు కార్మికులు సోమవారం మండల డిప్యూటీ తహసీల్దార్ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన మోటార్ రవానా కార్మికులకు ప్రభుత్వం వాహనమిత్ర పథకం కింద రూ.25 వేలు అందించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డ్రైవర్ల కోసం సాధికార సంస్థ ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో యూనియన్ నాయకులు లంకా మణికంఠ, కోలా నరేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోవాలంటూ టైలర్ల ధర్నా



చందర్లపాడు(నందిగామటౌన్): టైలర్ల కోసం ప్రభుత్వం వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయటంతోపాటు కుట్టుమిషన్ల కొనుగోలుకు రుణాలు అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. చందర్లపాడు టైలరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చందర్లపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడీమేడ్ వస్త్రాల కారణంగా పనులు లేక టైలర్లు పస్తుండాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టైలర్లను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఈదర కమల, షేక్ కరీం, సాధనాల రాము, షేక్ మస్తాన్‌వలి, రెహ్మతుల్లా, జానయ్య, రామారావు, బాషా, లాల్‌సా, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

జగ్గయ్యపేటఅర్బన్: ఏపీ మున్సిపల్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ కమిటీ పిలుపు మేరకు జగ్గయ్యపేట మున్సిపల్ కార్మికులు స్థానిక అంబేడ్కర్ కూడలిలో సోమవారం ధర్నా చేశారు. సీఐటీయూ పేట మండల కార్యదర్శి షేక్ గౌస్‌మియా ఆధ్వర్యంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ తులసి వెంకట కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట మండల సీఐటీయూ నాయకులు సోమోజు రామనాథం మాట్లాడుతూ 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, మున్సిపల్ కార్మికులందరికి పీఆర్సీ జీతం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19 వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 23వ తేదీన విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులందరికీ జీతాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాలో మున్సిపల్ కార్మికులు పారా ఎలకమ్మ, బత్తుల బుజ్జి, వెంకటేశ్వర్లు, పంది రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



పేటలో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

హామీల అమలుకు న్యాయవాదుల డిమాండ్



జగ్గయ్యపేట కోర్టు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేటఅర్బన్: కూటమి ప్రభుత్వం న్యాయవాదులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో న్యాయవాదులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ జూనియర్ లాయర్స్‌కు న్యాయమిత్ర పథకం కింద ఇచ్చే స్టయిఫండ్‌ను రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచుతామన్న కూటమి హామీ ఏడాదిగా అమలుకు నోచుకోలేదన్నారు. డెత్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ 100 కోట్ల గ్రాంట్‌ను వెంటనే ఏపీ బార్ కౌన్సిల్‌కు జమ చేయలని, లేకుంటే ఆలిండియా లాయర్స్ యూనియన్ తరపున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ లాయర్లు, ఆలిండియా లాయర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నవరస భరితం సాంస్కృతిక సమ్మేళనం



నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

విజయవాడ కల్చరల్: శరన్నవరాత్రుల్లో భాగంగా దేవదాయ ధర్మాదాయ శాఖ, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని కళావేదికపై సోమవారం ప్రదర్శించిన అంశాలు ఆకట్టుకున్నాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు 12 గంటలపాటు సాగాయి. దేవాలయం వాయిద్య కళాకారుల వాద్య సమ్మేళనంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ప్రమీలారాణి బృందం తాళ భజన, జి.రామలక్ష్మి బృందం, దుర్గేష నందిని భక్తి రంజని, అంజనా సుధాకర్ శాస్త్రీయ సంగీత కచేరి, మడలమ రాంబాబు భక్త కుచేల హరికథ, నందిని, అపర్ణా ప్రసాద్ బృందం సత్యవాణి బృందం, గన్నవరానికి చెందిన నటరాజ డాన్స్ స్కూల్, హరిత, సాత్విక, శ్రీవల్లి తమ బృందాలతో అన్నమయ్య, రామదాసు, త్యాగరాజ స్వామి కీర్తనలకు నృత్యాలను అభినయించారు. సహాయ కార్యనిర్వహణ అధికారి గంగాధర్ కార్యక్రమాలను ప్రారంభించారు. సైదా, రామకృష్ణ నిర్వహించారు. కళాకారులకు ప్రశంసా పత్రాలను, అమ్మవారి ప్రసాదాన్ని అందించారు.